11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 15 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం గురువారం 27 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 15 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 27 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల భవనంలో భారీ అగ్ని ప్రమాదం.. 13 మంది దుర్మరణం

- ఎగసిపడిన మంటలు
- వందలాది మందికి తాత్కాలిక ఆశ్రయాలను ఏర్పాటు చేసిన అధికారులు
- సంఘటన స్థలానికి చేరుకున్న 128 అగ్నిమాపక వాహనాలు, 57 అంబులెన్సులు



పెన్ పవర్ డెస్క్:హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల హౌసింగ్ కాం ప్లెక్స్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరికొందరు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలోనే తొమ్మిది మంది మరణించగా,

వివరాలు 2లో..

## యాంటీ షిప్ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించాం

- ఈ ప్రయోగం దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింతగా పెంచిందన్న రక్షణ శాఖ
- భూమిపై, సముద్రంపై ఉన్న లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలదని వెల్లడి
- క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలకు అధ్యక్షుడు, ప్రధాని అభినందనలు



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ సైన్యం యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని విజయ వంతంగా పరీక్షించినట్లు ప్రకటించింది. ఈ పరీక్షను మంగళవారం

వివరాలు 2లో..



## చంద్రబాబుకు రైతుల ఉసురు తగులుతుంది

- కూటమి పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదన్న జగన్
- టన్ను రూ.30 వేలు పలికిన అరటి ఇప్పుడు రూ.2 వేలకే పరిమితమైందని ఆవేదన
- 18 నెలల్లో రైతులకు ఒక్క రూపాయి ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వలేదని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని, కూటమి ప్రభుత్వ పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అరటి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈరోజు తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో టన్ను అరటి ధర రూ.30 వేల వరకు పలికిందని గుర్తు చేశారు. అరటి ఎగుమతుల కోసం అనంతపురం-ఢిల్లీ, తాడిపత్రి-ముంబైకి ప్రత్యేక రైళ్లను కూడా నడిపామని, కానీ ఇప్పుడు టన్ను రూ.2 వేలకు కూడా కొనేవారు లేక పంట చెట్లపైనే మాగిపోతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి రైతులపై ప్రేమ లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.గత 18 నెలల

వివరాలు 2లో..




# ఏపీ అసెంబ్లీలో అదరగొట్టిన విద్యార్థులు..



## నిజమైన సభను తలపించిన 'మాక్ అసెంబ్లీ'

- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో 'మాక్ శాసనసభ'
- 175 నియోజకవర్గాల నుంచి విద్యార్థులు పాల్గొని అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహణ
- స్పీకర్ ఎన్నిక, ప్రశ్నోత్తరాలు, బిల్లుల ఆమోదంతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన సభ
- రెండు కీలక బిల్లులపై వాడివేడి చర్చ.. ఆందోళనకు దిగిన ప్రతిపక్ష సభ్యులు
- పిల్లల కోసం భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:చట్టాలు చేయడం ముఖ్యం కాదు, వాటిని పాటించడమే అత్యంత ప్రధానం. ప్రతిపక్షం లేవనెత్తిన సమస్యలకు ప్రభుత్వం నిర్మాణాత్మకంగా పరిష్కారం చూపినప్పుడే అది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ స్ఫూర్తిని చాటుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. రాజ్యాంగ విలువలు, చట్టసభల కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వినూత్న ఆలోచనకు ఇది రూపం దాల్చింది. నిజమైన అసెంబ్లీని తలపించేలా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ వాగ్ధాటితో, విషయ పరిజ్ఞానంతో అందరినీ ఆకట్టుకున్నారు.



వివరాలు 2లో..

### శంకరగుప్తం డ్రెయిన్‌పై

## పవన్ దృష్టి..

### అధికారులకు సున్నిత హెచ్చరిక



- కేశనపల్లి కొబ్బరి రైతులతో పవన్ ముఖాముఖి
- కోనసీమ కొబ్బరి రైతుల గొంతుకనవుతానని వ్యాఖ్య
- సంక్రాంతి తర్వాత డ్రెయిన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ

వివరాలు 2లో..

## లెక్చరర్ కాను.. ఎమ్మెల్యే అవుతానని చెప్పి గెలిచా



- అసెంబ్లీలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- మాక్ అసెంబ్లీ నిర్వహించిన 175 నియోజకవర్గాల విద్యార్థులు
- మా ఎమ్మెల్యేల కన్నా మీరే బాగా చేశారన్న సీఎం చంద్రబాబు
- 28 ఏళ్లకే ఎమ్మెల్యే అయ్యానని గుర్తుచేసుకున్న సీఎం
- ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని విద్యార్థులకు పిలుపు

వివరాలు 2లో..

## ఐ-బొమ్మ రవిపై ఐదు కేసులు..

### మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు

- రెండో కేసులో కోర్టులో హాజరుపరిచిన సైబర్ క్రైమ్ పోలీసులు
- మిగిలిన మూడు కేసులకు సంబంధించి పీటీ వారెంట్ దాఖలు
- కోర్టు అనుమతితో మిగిలిన మూడు కేసుల్లోనూ అరెస్టు చూపనున్న సైబర్ క్రైమ్ పోలీసులు




పెన్ పవర్ డెస్క్:పైరసీ వెబ్‌సైట్ ఐ-బొమ్మ నిర్వాహకుడు రవికి నాంపల్లి కోర్టు మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించింది. సైబర్ క్రైమ్ పోలీసులు

వివరాలు 2లో..

## దక్షిణ కోస్తాపై వాయుగుండం ఎఫెక్ట్... ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం
- వాయుగుండంగా బలపడే అవకాశం
- శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు
- నెల్లూరు, తిరుపతి జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన



వివరాలు 2లో..

## ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు రామ్ లాల్ తో మంత్రి నారా లోకేశ్ సమావేశం



- ఉండవల్లి నివాసంలో జరిగిన సమావేశం
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ భేటీ
- దేశవ్యాప్త కార్యక్రమాలను వివరించిన రామ్ లాల్
- సమావేశంలో పాల్గొన్న పలువురు మంత్రులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రా ష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్ లాల్ తో సమావేశమయ్యారు.

వివరాలు 2లో..

## నాకు పదవి ముఖ్యం కాదు.. పార్టీయే ముఖ్యం



- ముఖ్యమంత్రి పదవి తనకు ముఖ్యం కాదన్న డీకే శివకుమార్
- పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టీకరణ
- అధికార మార్పిడిపై సరైన సమయంలో పార్టీయే నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- కాంగ్రెస్‌లో వ్యక్తి పూజ కాదు.. పార్టీ పూజ మాత్రమే ఉంటుందని వ్యాఖ్య
- తమ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని బీజేపీ, జేడీఎస్‌కు హితవు

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు ముఖ్యమంత్రి పదవి ముఖ్యం కాదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలు, భవిష్యత్ వ్యూహాలపై తన అభిప్రాయాలను

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ముంబయి మారణహోమానికి పదిహేడేళ్లు

ముంబయిలో జరిగిన మారణహోమానికి నేటితో పదిహేడేళ్లు పూర్తయింది. 2008వ సంవత్సరంలో నవంబర్ 26వ తేదీన ముంబైలో ముష్కరులు తెగబడ్డారు. బరితెగించిన ఉగ్రమూక దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో దాడులకు దిగారు. తాజ్ హోటల్ ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు పాల్పడ్డారు. అయితే ఈ దాడుల్లో ఎన్నో కుటుంబాలలో విషాదం నెలకొంది. అనేక మంది అమాయకులు ముష్కరుల చేతిలో అశువుల బాశారు. పదిహేడేళ్లవుతున్నా ముంబయి పేలుళ్ల గాయం నుంచి ఇంకా అనేక కుటుంబాలు కోలుకోలేదు.

**నవంబరు 26 2008న...**

2008 నవంబర్ 26వ తేదీన జరిగిన ఉగ్రదాడితో భారతదేశం వణికిపోయింది. ప్రపంచ దేశాలు కూడా ఈ ఉగ్రదాడి ని తీవ్రంగా ఖండించాయి. రాత్రి 9. 30 గంటలకు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్ లో చొరబడి ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు.ఛత్రపతి శివాజీ టెర్మినస్ తో పాటు 12 చోట్ల ముష్కరుల దాడికి దిగారు. ఈ దాడుల్లో అనేక మంది అమాయకులు మరణించారు. ఏకే 47 తుపాకులని ఎక్కుపెట్టి జరిపిన కాల్పుల్లో 58 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

**కసబ్ ను ఉరి తీసినా...**

ఊహించని దాడికి ప్రజలు అక్కడి నుంచి భయంతో పరుగులు తీశారు. అక్కడి నుండి వీధుల్లోకి వెళ్లి న ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. నారీమన్ లైట్ హౌస్ ,ఒబెరాయ్ ట్రైడెంట్, కామా హాస్పిటల్ ,తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, ఇలా వరుసగా 12 చోట్ల ఏకధాటిగా కాల్పులు, బాంబుల దాడులతో ముంబై నగరం భీతిల్లి పోయింది. దాదాపు అరవై గంటల పాటు సాగిన మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోగా వేలసంఖ్యలో అమాయక ప్రజలు క్షతగాత్రులయ్యారు.మరణించిన వారిలో 18 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. లష్కరే తోయిబా కు చెందిన పది మందిలో తొమ్మిది మందిని భద్రతా సిబ్బంది మట్టుబెట్టారు. ఇక ఈ ఉగ్రదాడిలో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాది అజ్మల్ కసబ్ ను ప్రాణాలతో పట్టుకున్నారు.ఈ కేసులో కసబ్ కు ఉరి శిక్ష విధించడంతో అతన్ని ఉరి తీశారు. కానీ నేటికీ ముంబయి మారణహోమం విషాదం వందలాది కుటుంబాలను వెంటాడుతూనే ఉంది.

# ఏపీ అసెంబ్లీలో అదరగొట్టిన విద్యార్థులు..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 175 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రిగా ఎం. లీలా గౌతమ్, ప్రతిపక్ష నేతగా సౌమ్య, ఉపముఖ్యమంత్రిగా కోడి యోగి, విద్యాశాఖ మంత్రిగా చిన్మయి, స్పీకర్‌గా స్వాతి వ్యవహరించారు. సభాపతి ఎన్నిక నుంచి బిల్లుల ఆమోదం వరకు అన్ని ప్రక్రియలను విద్యార్థులే స్వయంగా నిర్వహించారు. అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు, సమస్యలపై చర్చలతో సభా కార్యక్రమాలు హోరాహోరీగా సాగాయి.

**స్పీకర్ ఎన్నిక.. సభా గౌరవంపై హామీ**

ముందుగా ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో సభ ప్రారంభమైంది. జాతీయ గీతాలాపన అనంతరం స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కోడూరు ఎమ్మెల్యేగా ఉన్న విద్యార్థి కే. లోకేశ్వర్ రెడ్డి.. కుమారి స్వాతి పేరును స్పీకర్ పదవికి ప్రతిపాదించగా, మరో సభ్యుడు బి. అనిల్ కుమార్ బలపరిచారు. స్వాతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించగానే, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆమెను గౌరవంగా స్పీకర్ కుర్చీ వద్దకు తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్పీకర్ అధికార, ప్రతిపక్షాలకు సమానమని, సభా నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతిపక్ష నేత స్పందిస్తూ.. "ప్రభుత్వం మెజారిటీతో మా గొంతు నొక్కాలని చూస్తే, మీరే మాకు రక్షణగా నిలవాలి" అని కోరారు. దీనికి స్పీకర్ బదులిస్తూ.. "ఈ కుర్చీకి కుడి, ఎడమలు ఉండవు. కేవలం రాజ్యాంగం, సభా నియమాలు మాత్రమే ఉంటాయి. ప్రతిపక్షానికి తగిన సమయం ఇస్తాను. సభా గౌరవాన్ని కాపాడటం మనందరి బాధ్యత" అని స్పష్టం చేశారు.

**వాడివేడిగా ప్రశ్నోత్తరాలు.. మొబైల్ వ్యసనంపై చర్చ**

స్పీకర్ ఎన్నిక తర్వాత ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ నిర్వహించారు. వ్యవసాయం, విద్య, హోం, క్రీడలు, పట్టణాభివృద్ధి వంటి పలు శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులుగా ఉన్న విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యంగా, విద్యార్థుల్లో మొబైల్ వ్యసనంపై ఈ ఏడాది ఎన్ని కేసులు నమోదయ్యాయనే ప్రశ్నకు, వందల్లో కేసులు నమోదయ్యాయని విద్యాశాఖ మంత్రి తెలిపారు. బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని, డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు పరిశీలనలో ఉందని చెప్పారు.

అయితే, మంత్రి సమాధానంపై ప్రతిపక్ష సభ్యుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు లేవు. మీరు పైలట్ సెంటర్లు తెరిచేలోగా విద్యార్థుల భవిష్యత్తు స్విచ్ ఆఫ్ అయిపోతుంది" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. మంత్రి స్పందిస్తూ, "మేం విద్యార్థులను బాధితులుగా చూస్తున్నాం, మీరు అల్లరి మీద దృష్టిపెట్టారు" అంటూ బదులిచ్చారు.

**బిల్లులపై రగడ.. రంగంలోకి మార్షల్స్**

అనంతరం సభలో 'ఆంధ్రప్రదేశ్ పిల్లల ఆన్‌లైన్ భద్రత-సోషల్ మీడియా నియంత్రణ బిల్లు-2025', 'ఆంధ్రప్రదేశ్ విద్యార్థి పర్యావరణ పరిరక్షణ చట్టం-2025' అనే రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. పర్యావరణ పరిరక్షణ బిల్లుపై ప్రతిపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలనే నిబంధన పిల్లలపై భారం మోపడమేనని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు.

స్పీకర్ ఎంతగా విజ్ఞప్తి చేసినా వారు వెనక్కి తగ్గకపోవడంతో మార్షల్స్‌ను పిలవాల్సి వచ్చింది. మార్షల్స్ రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న సభ్యులను సభ నుంచి బయటకు పంపించారు. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా రెండు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

**పుస్తకావిష్కరణ.. విద్యార్థులతో మమేకమైన నేతలు**

మాక్ అసెంబ్లీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు హాజరయ్యారు. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'భారత రాజ్యాంగం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. మంత్రి నారా లోకేశ్ స్వయంగా విద్యార్థులకు శాసనసభ, శాసనమండలి హాళ్లను చూపించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. వారితో కలిసి భోజనం చేసి, ఫోటోలు దిగి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియపై మరుపురాని అనుభూతిని అందించింది.

# శంకరగుప్తం డ్రెయిన్‌పై పవన్ దృష్టి..

కోనసీమ కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని, వారి గొంతుకనవుతానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. ఈరోజు కోనసీమ జిల్లాలో పర్యటించిన ఆయన, శంకరగుప్తం డ్రెయిన్ కారణంగా నష్టపోయిన కేశనపల్లి కొబ్బరి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను ఓపికగా విన్నారు.కేవలం రూ.22 కోట్ల నిధులు ఇచ్చి హడావుడి చేసేందుకు తాను రాలేదని, సమస్యను మూలాల నుంచి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పవన్ స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ తర్వాత కోనసీమ వ్యాప్తంగా ఉన్న డ్రెయిన్ల సమస్యపై పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

"గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నాం. అబద్ధపు మాటలు చెబితే యువత నమ్మరు" అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై అధికారుల తీరును పవన్ కల్యాణ్ సున్నితంగా తప్పుబట్టారు. డ్రెయిన్ ఆక్రమణలపై అధికారులు ఎందుకు దృష్టి పెట్టలేదని ప్రశ్నించారు. గతంలో ఇరిగేషన్ నిపుణుడు రోశయ్య కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు పక్కన పెట్టారని నిలదీశారు. రైతుల సమస్యలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

# లెక్చరర్ కాను.. ఎమ్మెల్యే అవుతానని చెప్పి గెలిచా

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో ఈరోజు సంవిధాన్ దివస్ (రాజ్యాంగ దినోత్సవం) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 175 నియోజకవర్గాల నుంచి ఎంపికైన విద్యార్థులు నిర్వహించిన 'మాక్ అసెంబ్లీ' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మాక్ అసెంబ్లీని తిలకించిన అనంతరం సీఎం చంద్రబాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు సభను నడిపిన తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. "మా ఎమ్మెల్యేలు కొన్నిసార్లు తడబడతారు. కానీ, మీరు మాత్రం ఏమాత్రం తడబడకుండా ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడారు. మీ ప్రతిభ అభినందనీయం" అని అన్నారు. బాధ్యత, చైతన్యం పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. "28 ఏళ్లకే నేను ఎమ్మెల్యే అయ్యాను. లెక్చరర్ ఉద్యోగంలో చేరమని మా వైస్ ఛాన్సలర్ అడిగితే, నేను ఎమ్మెల్యే అవుతానని చెప్పి 1978లో గెలిచి చూపించాను" అని తెలిపారు. నిరంతర శ్రమ, సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కోవడం వల్లే తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, చిన్న వయసులోనే మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఎదిగానని వివరించారు.రాజ్యాంగం దేశానికి ఆత్మలాంటిదని చంద్రబాబు పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందుచూపుతో అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. "రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసేవారు మంచివారు కాకపోతే చెడు ఫలితాలు వస్తాయి. అమలు చేసేవారు మంచివారైతే చెడు రాజ్యాంగమైనా మంచి ఫలితాలను ఇస్తుంది" అని అంబేద్కర్ చెప్పిన మాటలను ఆయన గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఒక వజ్రాయుధమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# యాంటీ షిప్ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించాం

- మొదటి పేజి తరువాయి

స్థానిక నేవీ లాంచ్ పాడ్ నుంచి నిర్వహించినట్లు ఆ దేశ మిలిటరీ విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ క్షిపణి పరీక్ష దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింతగా పెంచుతుందని పేర్కొంది.ఈ క్షిపణి భూమిపై మరియు సముద్రంపై ఉన్న లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని ఐఎస్‌పీఆర్ వెల్లడించింది. అంతేకాకుండా, ఇది అత్యాధునిక మార్గదర్శక సాంకేతికతతో కూడుకున్నదని తెలిపింది. ఈ క్షిపణి పరీక్ష విజయవంతం కావడం పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా జాతి ప్రయోజనాలను కాపాడటంలో నేవీ యొక్క నిబద్ధతను బలోపేతం చేస్తుందని పాకిస్థాన్ నేవీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీని తర్వాత పాకిస్థాన్ తన రక్షణ సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి సారించింది.

# నాకు పదవి ముఖ్యం కాదు.. పార్టీయే ముఖ్యం

- మొదటి పేజి తరువాయి

పంచుకున్నారు."నాకు ముఖ్యమంత్రి పదవి గానీ, మరే ఇతర ఉన్నత పదవి గానీ ముఖ్యం కాదు. పార్టీలోని ప్రతి ఒక్కరితో కలిసికట్టుగా పనిచేసి, రాష్ట్రాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే ప్రధానం" అని శివకుమార్ అన్నారు. అధికార పంపకాల గురించి ఏవైనా చర్చలు జరిగితే, అవి పార్టీ నాలుగు గోడల మధ్యే జరుగుతాయని, సరైన సమయంలో పార్టీ అధిష్ఠానమే సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో వ్యక్తి పూజలకు తావులేదని, ఇక్కడ పార్టీకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, తాను సామూహిక నాయకత్వాన్ని నమ్ముతానని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై డీకే శివకుమార్ విమర్శలు గుప్పించారు. తమ పార్టీ అంతర్గత విషయాల గురించి బీజేపీ, జేడీఎస్ నేతలు బహిరంగంగా మాట్లాడాల్సిన అవసరం లేదని, ముందు వారి సొంత సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. "కాంగ్రెస్‌లో ఉన్నది ఒకే వర్గం, అది 'కాంగ్రెస్ వర్గం' మాత్రమే. కష్టకాలంలో పార్టీ నాకు అండగా నిలిచింది. నా గురించి ప్రతిపక్ష నేతలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. నేను పక్కా కాంగ్రెస్ వాదిని" అని ఆయన అన్నారు.రానున్న 2028, 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చే వ్యూహంపై సీనియర్ నేత, ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళితో చర్చించినట్లు శివకుమార్ వెల్లడించారు. సతీశ్ జార్కిహోళి పార్టీకి ఒక పెద్ద ఆస్తి అని, తామిద్దరం కలిసికట్టుగా పనిచేస్తామని చెప్పారు. "ఈ విజయం కోసం నేను ఒక్కడినే కష్టపడలేదు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య నాయకత్వంలో, ఎమ్మెల్యేలందరి సమష్టి కృషితో పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ విజయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని ఆయన వివరించారు.ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన "శివకుమార్ వొక్కలిగలకు నాయకుడు కాదు" అనే వ్యాఖ్యపై స్పందిస్తూ, "నేను వొక్కలిగ నాయకుడినని ఎప్పుడూ చెప్పుకోలేదు. నేను కాంగ్రెస్ పార్టీ నాయకుడిని. కాకపోతే, ఆ కులంలో పుట్టానన్నది వాస్తవం. మనం కులానికి, మతానికి దూరంగా ఉండాలనుకున్నా, అవి మనల్ని వదిలిపెట్టవు" అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు.

## హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల భవనంలో భారీ అగ్ని ప్రమాదం.. 13 మంది దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం నుంచి బయటపడిన హౌసింగ్ కాంప్లెక్స్‌లోని వందలాది మందిని తాత్కాలిక ఆశ్రయాలకు తరలించారు.

థాయ్‌పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో సుమారు 2,000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని మీడియా కథనాలు వెల్లడించాయి.ఈ ఘటనను 4వ నెంబరు ప్రమాదంగా అధికారులు ప్రకటించారు. అత్యయిక పరిస్థితి ప్రకటించినప్పుడు భారీస్థాయిలో ఫైరింజన్లు, సిబ్బందిని మోహరించవలసి ఉంటుంది. ఈ నివాస సమదాయంలో దాదాపు 4,800 మంది నివసిస్తున్నారు. 128 అగ్నిమాపక వాహనాలు, 57 అంబులెన్సులను ఘటనా స్థలానికి తరలించారు. మంటల్లో చిక్కుకున్న వారిలో వృద్ధులు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## దక్షిణ కోస్తాపై వాయుగుండం ఎఫెక్ట్... ఏపీఎస్డీఎంఏ అలర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక, హిందూ మహాసముద్రం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం, ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ గురువారం నాటికి వాయుగుండంగా బలపడనుందని తెలిపింది.

ఆ తర్వాత 48 గంటల్లో ఇది మరింత బలపడి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో గురువారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. అలాగే శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మరోవైపు, మలక్కా జలసంధి సమీపంలో ఏర్పడిన 'సెన్యార్' అనే తుపాను ఇప్పటికే ఇండోనేషియా వద్ద తీరం దాటినట్లు అధికారులు తెలిపారు.

## ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు రామ్ లాల్ తో మంత్రి నారా లోకేశ్ సమావేశం

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమని మంత్రి లోకేశ్ స్వయంగా వెల్లడించారు.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ చేపడుతున్న కార్యక్రమాలు, సంస్థ విశిష్టత గురించి రామ్ లాల్ తనకు వివరించారని లోకేశ్ పేర్కొన్నారు.రామ్ లాల్ 2006-2019 మధ్యకాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా (సంస్థాగత), ఆర్ఎస్ఎస్‌లో పలు ఉన్నత పదవుల్లో పనిచేశారని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో పలువురు రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొన్నట్లు ఆయన తన ప్రకటనలో తెలిపారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను, ఫోటోలను లోకేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఈ భేటీ సందర్భంగా లోకేశ్... మంగళగిరి చేనేత శాలువా కప్పి రామ్ లాల్ ను సత్కరించారు. ఆయనకు బాలల రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరించారు.

## చంద్రబాబుకు రైతుల ఉసురు తగులుతుంది

- మొదటి పేజి తరువాయి

కాలంలో రాష్ట్రంలో 16 సార్లు విపత్తులు సంభవించినా, రైతులకు ఒక్క రూపాయి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేదని జగన్ ఆరోపించారు. తమ హయాంలో సీజన్ ముగిసేలోపే పరిహారం అందించామని తెలిపారు. "వ్యవసాయం దండగ అని చంద్రబాబు నమ్ముతారు. అందుకే అన్నదాత సుఖీభవ హామీని నిలబెట్టుకోలేదు. రైతులు ఎరువులను సైతం బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని కల్పించారు" అని మండిపడ్డారు.అరటి మాత్రమే కాకుండా మిర్చి, పసుపు, పొగాకు వంటి ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబుకు రైతుల ఉసురు తప్పకుండా తగులుతుందని, ఈ కూటమి ప్రభుత్వం త్వరలోనే బంగాళాఖాతంలో కలవడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

## ఐ-బొమ్మ రవిపై ఐదు కేసులు..

**మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు**

- మొదటి పేజి తరువాయి

ఈ రోజు రవిని కోర్టులో హాజరుపరిచారు. రవిపై సైబర్ క్రైమ్ పోలీసులు ఇదివరకే 5 కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం రెండో కేసులో అతడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.మిగిలిన మూడు కేసులకు సంబంధించి కూడా పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఆ మూడు కేసుల్లోనూ అరెస్టు చూపనున్నారు. రవిని పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఇదివరకే పోలీసులు రవిని ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

# నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**పెద్దాపురం, పెన్ పవర్, నవంబర్ 26 :** పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, కాంట్రాక్టు కమిటీ సమావేశాలు ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగనున్న ఈ సమావేశానికి వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు హాజరవుతారని ఆయన తెలిపారు.


పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## రాజకీయాలకు అతీతంగా విశాఖ అభివృద్ధి -ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 26.** విశాఖపట్నం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పనిచేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గోపాలపురం శాసనసభ్యులు, అసెంబ్లీ బడ్జెట్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యులు మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం అయిన విశాఖపట్నంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ భారతదేశంలోని ఒక ప్రత్యేకమైన నగరంగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ కు అభివృద్ధిలో ముఖద్వారం లాంటిది అన్నారు. ఈ నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించి ఏమేమి కావాలి, నిధులు ఎలా ఖర్చు చేయాలి, అభివృద్ధి ఎలా చేయాలి అనే విషయాలపై సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు. అంతేగాక వైజాగ్ లో అనేక పరిశ్రమలు వచ్చి ఎంతోమందికి ఉపాధి పెరిగే అవకాశం ఉందన్నారు. ఇక్కడ పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

## ఉద్యానవన పరిశోధన కేంద్రాన్ని నర్సరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎంపీ పురందరేశ్వరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ నవంబర్ 26:** పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి రూరల్ వేమగిరిలోని హార్టికల్చర్ పరిశోధనా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను సిబ్బంది ఎమ్.పి. వివరించారు. ప్రతీ నర్సరీ రైతు ఈ పరిశోధనా కేంద్రం ద్వారా ఉపయోగం పొందాలన్నారు. విధిగా ప్రతీ నర్సరీ రైతు తమ పేరును హార్టీకల్చర్ ఏడి ఆఫీసులో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం
రాజమండ్రి ఆల్కాట్ తోటలోని కాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. సమస్యలపై ఆరాతీసారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తనకు పూర్తి వివరాలు అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, స్టేట్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్.యానాపు ఏసు , కడియం మండల ప్రెసిడెంట్ బోలుసు సుబ్రహ్మణ్యం. మండల అధ్యక్షులు షేక్ సాజిద్, ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి అభివృద్ధి మండలి సభ్యుడు ఒంటెద్దు స్వామి. డాక్టర్, కొండల రావు, నాగులపల్లి. వీరబాబు వేమగిరి మాజీ సర్పంచ్ గుత్తుల. హరిచంద్ర ప్రసాద్ బివి సుబ్రమణ్యంతదితరులు పాల్గొన్నారు

## కిర్లంపూడి మండలంలో ఘనంగా షష్టి మహోత్సవాలు

-భక్తులతో కిటకిటలాడిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 26:** సుబ్బారాయుడు షష్టి మహోత్సవాలను పురిష్కరించుకుని బుధవారం కిర్లంపూడి మండలంలో పలు గ్రామాల్లో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిల్లంగి రామచంద్రపురం, కృష్ణవరం, గ్రామాల్లో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు బుధవారం తెల్లవారుజాము నుండి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. సంతానం లేనివారు ఉపవాసాలతో ధీక్షలు చేపటారు. స్వామివారని దర్సించుకుని విశేషఅభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిల్లంగి గ్రామం శ్రీనివాస్ నగర్ లో వేంచేసి ఉన్న బాలసుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త కింతాడ సన్యాసిరావు ఆధ్వర్యంలో వేకువ జాము నుండి గణపతి పూజ పవిత్ర గంగా జలములు, పంచామృతాభిషేకలతో ఆలయ ప్రధాన అర్చకులు ప్రనిర్వహించారు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్బంగా ఆలయాలు భక్తులతో కిటికీలాడాయి అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

## బసవేశ్వర స్వామి షష్ఠి సంబర మహోత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి.



**మండపేట.పెన్ పవర్.నవంబర్ 26:**నెలటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నీలాంబిక సమేత శ్రీ బసవేశ్వర స్వామి వారిని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం దర్శించుకున్నారు.సుబ్రహ్మణ్య షష్ఠి సంబర మహోత్సవాల్లో ముఖ్య అధితిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు.అనంతరం కమిటీ సభ్యులు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రాక్షుల సూర్య నాగ లింగం, నేలటూరు వైస్ ప్రెసిడెంట్ సెనక్కాయల దొరబాబు ఎంపీటీసీ రుద్రాక్షుల వీర గౌరీకుమారి చిన్న వీర్రాజు,వాసా సూరిబాబు,వెన్న బసయ్య,అందే సత్తిబాబు,మాజీ సర్పంచ్ రుద్రాక్షుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విలీనం కు కర్మ కర్త క్రియ అన్ని వేగుళ్ళే.

- సీఎం చంద్రబాబు కు కృతజ్ఞతలు.
- ఎమ్మెల్యే వేగుళ్ళ కు అభినందనలు.
- గెజిట్ వెలువడిన వెంటనే వేగుళ్లకు ఘనంగా పౌర సత్కారం.
- అఖిలపక్ష సమావేశంలో జే.ఏ.సీ. చైర్మన్ కామన ప్రభాకర్రావు.



**మండపేట. పెన్ పవర్.నవంబర్ 26:**రాజమహేంద్ర వరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో మండపేట నియోజక వర్గం విలీనం లో కర్మ కర్త క్రియ అన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు నే నని మండపేట జె ఏ సి చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు.
మండపేట నియోజవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలిపేందుకు సబ్ కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అఖిలపక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు తెలిపారు. మండపేట మండలం ఏడిద డాక్టర్ దాసరి నారాయణరావు ట్రస్ట్ భవన్ లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కామన పాల్గొని మాట్లాడారు. గతం లో సబ్ కమిటీ మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు ఆమోద ముద్ర వేయగా తాజాగా సీఎం చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. అధికారులు ఇప్పుడు గెజిట్ ప్రకటనకు సంబంధించిన వ్యవహారం సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఈ మొత్తం వ్యవహారంలో కర్త, కర్మ, క్రియా అంతా తానై చూసుకున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు ఈ విషయంలో మనస్పూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గెజిట్ వెలువడిన అనంతరం ఈ విజయానికి కారకుడైన ఎమ్మెల్యే వేగుళ్ళ కు ఘనంగా పౌర సత్కారం నిర్వహిస్తామన్నారు. ముందడుగు వేసి ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన అఖిల పక్ష కమిటీ ద్వారా పోరాటం సాగించిన సభ్యులకు చిరు సత్కారం, జ్ఞాపికలు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం మిఠాయిలు పంచి వేడుకలు జరుపుకున్నారు. ఈ సమావేశంలో జే.ఏ.సీ సభ్యులు ధూళి జయరాజు మాదిగ, కోన సత్యనారాయణ, వాదా ప్రసాదరావు, గుండు వీర తాతరాజు, కుచ్చు బాబీ, వలపుదాసు చిన్న, పువ్వలపల్లి రాజా, లంక రాణా తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన భాస్కర స్కూల్





**చింతూరు, పెన్ పవర్ నవంబర్ 26:**భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీ భాస్కర విద్యానికేతన్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది రాజ్యాంగంపై నినాదాలు చేస్తూ ర్యాలీగా చింతూరు ప్రధాన చౌరస్తాకు చేరుకుని, అక్కడ ఉన్న డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్‌లను పాఠశాల ప్రతినిధులు ఆహ్వానించారు. అనంతరం సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి భారత పౌరుడు రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరమని, ముఖ్యంగా విద్యార్థులు రాజ్యాంగాన్ని చదివి హక్కుల సాధన కోసం పోరాటస్ఫూర్తిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగరచయిత బీఆర్ అంబేద్కర్ అనేక కష్టాలను ఎదుర్కొంటూ సమాజంలోని కులమత భేదాలను అధిగమించి, అందరి సంక్షేమం కోసం రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తుచేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి వేణు గోపాల్, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంపచోడవరం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా శివ ప్రసాద్



**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 26:**రంపచోడవరం నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా ముచ్చకర్ల శివప్రసాద్ ను నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుండి తనకు ఉత్తర్వులు అందినట్లు శివప్రసాద్ వెల్లడించారు. తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన శివప్రసాద్ కు పార్టీ అధిష్టానం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనను టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే శిరీష దేవి ,నియోజవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్ కు శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాజ్యాంగాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత





రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ రాజ్

**రంపచోడవరం, పెన్ పవర్ నవంబర్ 26 :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారు రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారిని ఎప్పటికప్పుడు స్మరించుకునే బాధ్యత ప్రతి భారతీయ పౌరుడు పై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సిబ్బందితో ఏర్పాటు చేసిన 76వ భారత రాజ్యాంగ దినోత్సవానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ మన దేశానికి 1947 ఆగస్టు 15 న స్వాతంత్రం వచ్చిన అనంతరం 1949 సంవత్సరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారితోపాటు కొంతమంది కమిటీ సభ్యులతో కులమతాలకతీతంగా భారత రాజ్యాంగాన్ని వ్రాయడం జరిగిందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా అనేకసార్లు రాజ్యాంగానికి సవరణలు తీసుకొనే హక్కు భారత పార్లమెంట్ కు ఉంటుందని అదేవిధంగా సవరణలు చేసిన తర్వాత రాజ్యాంగం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం జరుగుతుందని అదేవిధంగా రాష్ట్రాలలో అయితే గవర్నమెంట్ జీవోల ద్వారా సంబంధిత శాఖల ద్వారా అమలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్రాలలో అయితే రెవిన్యూ శాఖ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో పనిచేయవలసి ఉంటుందని ఆయన అన్నారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన సవరణలు ద్వారా జీవోలు ఆయా పంచాయతీలలో ప్రజలకు అవసరమగు సదుపాయాలు అమలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం పేద బడుగు బలహీన వర్గాల వారికి కుల మతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు స్వేచ్ఛ స్వతంత్రంలో జీవించే విధంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వారు రాజ్యాంగం రాయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి భారతీయ పౌరుడు విద్య ఆరోగ్యం పొందే విధంగా రాజ్యాంగంలోని వ్రాయడం జరిగిందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన విధివిధానాలు ప్రతి భారతీయుడు పాటించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ 1949 నవంబర్ 26 తారీఖున భారత రాజ్యాంగం చట్టం చేయడం జరిగిందని అదేవిధంగా 1950 సంవత్సరంలో భారత రాజ్యాంగం పూర్తిస్థాయిలో పేద బడుగు బలహీనవర్గాల వారికి ఉపయోగపడే విధంగా అప్పటి ప్రభుత్వం అమలు చేయడం జరిగిందని ఆమె అన్నారు. భారత రాజ్యాంగం పేద బడుగు బలహీన వర్గాల వారికి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కుల మతాలకు అతీతంగా ఈ రాజ్యాంగం అట్టడుగు వర్గాల వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి భారతీయ పౌరుడికి సమాన హక్కులు కల్పించడం జరిగిందని ఆమె అన్నారు. మన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని ఆమె అన్నారు. మన భారత రాజ్యాంగమును ప్రతి భారతీయుడు కుల మతాలకు అతీతంగా రాజ్యాంగమును కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని ఆమె అన్నారు. రంపచోడవరం పంచాయతీ సర్పంచ్ యం. బొజ్జయ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి భారతీయుడికి సమాన హక్కులు కల్పించే విధంగా భారత రాజ్యాంగం వ్రాయడం జరిగిందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం కులమతాలకతీతంగా బాగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్ కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ప్రతి పౌరుడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారు వ్రాసిన రాజ్యాంగం గురించి అవగాహనతో ఉండాలని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా చాలామంది నిరుపేదలు ఆర్థికంగా వెనుకబడిన విద్యలో చాలా వరకు అభివృద్ధి చెందారని ఆయన అన్నారు. భారతదేశంలోని ప్రతి పౌరుడుకు రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించి వెనుకబాటుతనాన్ని నిర్మూలించే విధంగా మన రాజ్యాంగం చాలా గొప్పదని ఆయన అన్నారు. అనంతరం రంపచోడవరం ఏపీవో జనరల్ డిఎన్వి రమణ భారత రాజ్యాంగంపై వివిధ శాఖల అధికారులతో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు,అడిషనల్ ఏ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత, పీహెచ్వో దేవదానం, ఎస్ ఓ మార్తమ్మ,ఎంపీడీవోలు, ప్రసాద్, వై.రాజు,ఏవో జయంతి, డిప్యూటీ తహసిల్దారులు స్వామి, ఫయాజ్ భాష(జిలాని) సూపర్డెంట్లు బి.కిషోర్,రాజారెడ్డి,ఐటీడీఏ మేనేజర్ బి.రాజు, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారి గోపాల్,ఉపాధి హామీ పథకం ఎపిఓ బి. సత్యనారాయణ, వెలుగు ఎపిఎం గొర్లె కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు నాగభూషణం, నరసింహారావు, నీరజ,పి.వెంకటేశ్వరరావు,డి. ప్రభాకర్ ,శ్రీనివాసరావు,చక్రధర్ బాబు,దిలీప్ కుమార్,బి.మార్గదర్శి,జ్యోతి రాజు,పి.భీమిరెడ్డి,లక్ష్మిరెడ్డి,గురుకులం సెల్ అధికారి నాగేంద్ర,వై టి సి మేనేజర్ సుధీష్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచు తెరలతో నిండిపోయిన అడ్డతీగల...





**అడ్డతీగల, పెన్ పవర్, నవంబర్ 26 :** మండల కేంద్రమైన అడ్డతీగల లో బుధవారం విపరీతమైన మంచు కురవడంతో ఉదయం 9 గంటలకు కూడా సూర్య భగవానుడు కనబడలేదు. అడ్డతీగల గ్రామం మొత్తం మంచు తెరలు కొమ్ముకొని అందంగా దర్శనమిచ్చింది, చూపరులను ఆహ్లాద పరిచింది, పిల్లలు పెద్దలు ఉదయాన్నే ఈ మంచు తెరలను ఆస్వాదించారు. దీనికి తోడు విపరీతమైన చలి ఉండడంతో ఏజెన్సీలో లంబసింగు ప్రాంతాన్ని తలపిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.


## బేటీ బచావో బేటీ పడావో ప్రతి ఒక్కరి బాధ్యత




**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 26 :**ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం పిలుపునిచ్చారు.

స్థానిక ఎం ఆర్ సి లో బుధవారం బేటీ బచావో– బేటీ పడావో ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అనే ప్రోగ్రామ్ – స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జడ్పిటిసి బేబీ రత్నం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహం 18 సంవత్సరాల వయసు నిండని ఆడపిల్లలకు 21 సంవత్సరాలు వయసు నిండని మగ పిల్లవాడికి వివాహం చేసుకునే హక్కు లేదు అని అన్నారు. అలాగే బాల్య వివాహాలు జరగడం వలన కలిగే నష్టాలు కోసం కూడా ఆమే మాట్లాడుతూ అవి%ొ% చదువు నష్టం, శారీరక ఎదుగుదల నష్టం,ఆర్థిక పరిస్థితి నష్టం గురించి వివరించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి గ్రామాల్లో బాల్య వివాహాలు వలన జరిగే నష్టాలు కోసం నిర్వహించే కార్యక్రమం నిర్వహించే ముందు ఆ గ్రామంలో గల ప్రజాప్రతినిధులు సర్పంచ్ లేదా గ్రామంలో గల పెద్దలకు సమాచారం ఇచ్చి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మణ రావు మాట్లాడుతూ చిన్నవయసులో వివాహం చెయ్యడం వలన జరిగే నష్టాలు అనగా చిన్న వయసులో వివాహం చెయ్యడం వలన ఆ బాలిక/బాలుడు యొక్క చదువు ఎదుగుదల నష్టపోతుంది అని వివరించారు .గ్రామంలో గల టీనేజర్స్ 19 సంవత్సరాలు నిండని పిల్లలని లిస్టౌట్ చేసి వారికి అవగాహన కల్పించమని గ్రామ స్థాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాసిల్దార్.శ్రీనివాసరావు
మాట్లాడుతూ బాల్య వివాహాల గురించి ప్రస్తావిస్తూ బాల్య వివాహాలు జరిగుతున్న సమయంలో ఎవరయితే దానికి అండగా ఉండి జరిపిస్తే దానికి బదులుగా ముందుగా గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు చర్య తీసుకోవడుతుంది హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశ్వరరావు, ఏబీఎఫ్ హేమలత , ఏటీఎం.అప్పలకొండ ఐసిడిఎస్ సూపర్వైజర్లు.కుమారి, పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎంలు, వీఆర్వోలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఏపీ నిట్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 26.**నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం పరిపాలనా భవనం వద్ద ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని, ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించి రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు అంబేద్కర్ జీవిత విలువలను ఆచరణలో పెట్టి ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. భారత ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు లభించడం రాజ్యాంగం అమలు ఫలితమేనని ఆమె వివరించారు. అనంతరం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్య, భోదన, బోధనేతర సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ ఎన్. జయరాం, డాక్టర్ వీరేశ్‌కుమార్, అసోసియేట్ డీన్లు డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ శీనివాసన్, ఆచార్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ వినోద్‌కుమార్ రాజా, డాక్టర్ తేజోజు రమేష్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ జగన్ మోహనరావు, డాక్టర్ శ్రీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి స్కూల్ లో బాలల దినోత్సవ సందడి

విజేతలకు బహుమతి అందించిన స్కూల్ ప్రిన్సిపాల్ భాష








**రావులపాలెం పెన్ పవర్ నవంబర్26:**రావులపాలెం వాగ్దేవి స్కూల్‌లో బుధవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా డాన్స్ ప్రోగ్రామ్ ప్రేక్షకులను అలరించింది. పాఠశాల ప్రాంగణం నవ్వులతో, హర్షధ్వానాలతో కిక్కిరిసిపోయింది. డాన్స్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ బాషా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ బహుమతులు అందజేశారు. పిల్లలు క్రమశిక్షణ, సృజనాత్మకత, ఆట%–%పాటలతోపాటు విద్యలోను మెరుగుపడాలని ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల తోడ్పాటుతో మన దేశ భవిష్యత్తు బలపడుతుందని, వారికి నైతిక విలువలతో కూడిన విద్య అందించడమే తమ లక్ష్యమని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. చివరగా పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగించారు

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు





**రావులపాలెం పెన్ పవర్ నవంబర్26**: రావులపాలెం – 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఈతకోట గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఘన నివాళు లర్పణ కార్యక్రమం నిర్వహించారు. కొత్త సెంటర్ వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డియే కూటమి నాయకులు మైగాపుల గురవయ్య నాయుడు, తెలుగురైతు రావులపాలెం మండల అధ్యక్షులు యర్రంశెట్టి నాగేశ్వరరావు (బుజ్జి), జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు యర్రంశెట్టి రాంమోహన్ రావు (రాము), బీజేపీ సీనియర్ నేత గంగ్రోతు వీరగోవిందరావు, టీడీపీ సీనియర్ నాయకులు జనిపిరెడ్డి వెంకటేశ్వరరావు, వెలుగట్ల రామకృష్ణ, ప్రజాసేవకుడు గంగ్రోతు దుర్గాసురేష్, జనసేన సైనికులు గంగ్రోతు గౌతమ్, యర్రంశెట్టి వి.వి. సత్యనారాయణ (కాసు), రాచకొండ రాముడు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు
ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగ ఆమోదం లభించి 76 ఏళ్లు పూర్తయిన చారిత్రాత్మక దినమిది అని పేర్కొన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించబడి, దేశ ప్రజాస్వామ్య ప్రయాణానికి బలమైన పునాది పడిందని గుర్తుచేశారు.

అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువలకు ప్రతీకగా నిలిచిందని, ప్రతి పౌరునికి హక్కులతో పాటు బాధ్యతలను కూడా స్పష్టంగా నిర్ధేశించిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సాధికారత, సమాన అవకాశాలే రాజ్యాంగ ఆత్మ అని అన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి మరింత ప్రాధాన్యం లభించిందని, రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించడం ప్రజల్లో చైతన్యాన్ని పెంచిందని అభిప్రాయపడ్డారు.

ఈ మహోన్నత రాజ్యాంగాన్ని భావితరాలకు అందించి గౌరవిద్దామని, దాని ఉన్నత ఆశయాలను ఆచరిస్తూ భారతదేశ ప్రతిష్టను మరింత ఎదిగిద్దామని పిలుపునిచ్చారు.

# ర్యాలి క్షేత్రంలో జగన్మోహిని కేశవ స్వామి కళ్యాణ మహోత్సవం

స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు.





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 26:**ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి మాస కళ్యాణం బుధవారం ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక నైవేద్యాలు, మంగళవాద్యాల నడుమ ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు సంప్రదాయ పద్ధతిలో కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి దేవాలయం భక్తిరసంతో, వైదిక ఘోషలతో మార్మోగింది.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాలు భక్తుల నామస్మరణతో సందడిగా మారాయి.తదుపరి మాస కళ్యాణం 23-12-2025న జరుగనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి. వెంకటరమణమూర్తి తెలిపారు. భక్తులు సమయానుకూలంగా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

## వేళంగి కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం: అంబేడ్కర్‌కు ఘన నివాళి, విద్యార్థులకు సర్పంచ్ బహుమతులు.



**కరప, పెన్ పవర్, నవంబర్ 26:** భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని, స్థానిక వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ వాణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమరాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్పంచ్ నీలిమరాజేష్, అతిథులు, అధ్యాపక బృందం కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. ?ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొల్లి రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించడంలో డా. అంబేద్కర్ చేసిన అపారమైన కృషిని, ఆయన దార్శనికతను సవివరంగా తెలియజేశారు. ముఖ్యంగా సాంఘిక సమానత్వం, పౌర హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన కీలక అంశాలను విద్యార్థులు అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన చెప్పారు. రచయిత సవిలే రాజేష్ ప్రసంగిస్తూ, డా. అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపొందించబడిన భారత రాజ్యాంగం, దేశ ప్రజలందరికీ సమాన న్యాయం, స్వేచ్ఛ, భద్రత కల్పించడంలో ఏ విధంగా రక్షణ కవచంగా నిలిచిందో వివరించారు. దేశ పౌరులుగా రాజ్యాంగం పట్ల గౌరవం, దాని ఆదర్శాలను అనుసరించడం ఎంత ముఖ్యమో ఆయన తెలియజేశారు. అనంతరం, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు సర్పంచ్ సవిలే నీలిమరాజేష్ బహుమతులను అందించారు. వారికి మెడల్స్, ఉన్నత విద్యకు, ఉద్యోగావకాశాలకు ఉపయోగపడే కాంపిటీటివ్ పుస్తకాలతో పాటు, రచయిత పోనుగుమట్ల విష్ణుమూర్తి వ్రాసిన "మనం మన రాజ్యాంగం" అనే విలువైన పుస్తకాలను సైతం అందించారు. ఈ పుస్తకాలు యువతకు రాజ్యాంగం గురించి లోతైన అవగాహన కల్పిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పినిశెట్టి వీరభద్ర రావు, సన్నపు సూర్యనారాయణ, పట్టా కృపారావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ం

# పెద్ద అడ్డపల్లిలో రైతన్న మీకోసం



**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 26:**మండలంలోని పెద్ద అడ్డపల్లి లో రైతన్న మీకోసం కార్యక్రమం టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ సిబ్బంది చేపట్టిన సర్వేలో రైతులు తమకు అవసరమైన పనిముట్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు రైతుల ఇంటింటికి వెళ్లి రైతన్న మీకోసం కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసన్న దొర ,అబ్బాయి రెడ్డి, వెంకటరమణ, సుధా, వ్యవసాయ శాఖ, సచివాలయం, సిబ్బంది .తదితరులు ఉన్నారు.

# గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకం



రైతు సాధికార సంస్థ డైరెక్టర్ బాబురావు నాయుడు



**చింతూరు, పెన్ పవర్ నవంబర్ 26:**రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రత్నాపురం గ్రామంలో బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిన అన్నదాత సుఖీభవ పథక నిధుల పరిస్థితిని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 5,000, కేంద్ర ప్రభుత్వం 2,000గా మొత్తం 7,000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని ప్రజలకు వినిపించి, అందరికీ పారదర్శకంగా వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలు పండించాలని రైతులకు సూచించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ మళ్లీ పెరుగుతుందని, పంటల మార్పిడి పాటిస్తూ ప్రకృతి విపత్తులకు తట్టుకునే పద్ధతిగా ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున అవలంబించాలని ఆయన సూచించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబురావు నాయుడు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు మహిళా సాధికారత కోసం ఏర్పాటు చేసినట్లే, రైతులు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం కోసం సంఘాలుగా ఏర్పడి సాగు చేయాలని పిలుపునిచ్చారు. రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం చేయాలని చెప్పారు. అనంతరం రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయా లేదా అన్నది పరిశీలించారు. జీవామృతం తయారీ విధానాన్ని జిల్లా ఇంచార్జ్ భాస్కర్ ప్రదర్శనగా చూపించి రైతుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఓబిల్నేని నరసింహారావు, టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, సయ్యద్ ఆసిఫ్, రైతు సాధికార సంస్థ చింతూరు డివిజన్ ఇంచార్జ్ కొండ, సూపర్వైజర్ వెంకటేష్, వాలంటీర్ వెంకన్న, జనసేన నాయకుడు కన్నారావు, సచివాలయ సిబ్బంది శివరామకృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కుంజా రామారావు ఇంట్లో భారీ అగ్నిప్రమాదం






జేకేసీ ట్రస్ట్ తరపున సహాయం

**చింతూరు పెన్ పవర్ నవంబర్ 26:**ఏడుగురాళ్లపల్లి పంచాయతీ కాటుకపల్లి గ్రామానికి చెందిన కుంజా రామారావు ఇంటిలో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇంటి ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిప్రమాదం విషయం తెలియడంతో జేకేసీ ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మహమ్మద్ జమాల్ ఖాన్ తెల్లవారుజామున 5.25 గంటలకు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధిత కుటుంబానికి ట్రస్ట్ తరపున అవసరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. తదుపరి బాధితులను చింతూరుకు పిలిపించి, ఇంటి మరమ్మతులకు అవసరమైన 10 రేకులు, 10 పైపులు, 20 కిలోల బియ్యం, నిత్యావసరాల కోసం రూ.5,000 నగదు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా నరేష్, పి. సల్మాన్ రాజు, రియాజ్, ఉమామహేశ్వరరావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు





**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 26:**అయ్యప్ప స్వామి మాలదారులు మండల దీక్ష పూర్తి చేసుకుని బుధవారం శబరిమలై బయల్దేరి వెళ్లారు. స్థానిక రామాలయంలో ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి పీఠం నుండి గురుస్వామి శేషాచార్యులు ఆధ్వర్యంలో సుమారు 20 మంది స్వామి మాలదారులు 40 రోజులపాటు దీక్ష చేపట్టి బుధవారం ఇరుముడులు కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి స్వామి మాలదారుల బంధువులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంత రం స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు

## రాజ్యాంగ దినోత్సవం వేడుకల్లో ఎగ్జిబిషన్





**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 26:**భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో సోషల్ సంబంధించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు పలు అంశాలకు సంబంధించిన పలు వస్తువులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ను ఎంపీపీ కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం ,ఎంపీడీవో లక్ష్మణరావు, ఎంఈఓ మల్లేశ్వరరావు సందర్శించారు .విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని అభినందించారు. విశేష ప్రతిభ కనబరిచిన పలు అంశాలకు సంబంధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ ఆశయాల పరిరక్షణకు ప్రతిజ్ఞ



**కరప, పెన్ పవర్, నవంబర్ 26:** దేశ అత్యున్నత గ్రంథమైన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన చరిత్రాత్మక నవంబర్ 26వ తేదీని పురస్కరించుకుని, మండల కేంద్రం కరపలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ ప్రత్యేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ?ముందుగా, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీపీ శ్రీలక్ష్మి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా, ఎంపీపీ శ్రీలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ సిబ్బంది అంతా భారత రాజ్యాంగ ఆశయాలు, విలువలను పరిరక్షించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, జూనియర్ సహాయకులు రామలక్ష్మి, టైపిస్ట్ ఐ.వి.వి. కార్తీక్, మండల కంప్యూటర్ ఆపరేటర్ ఎం. గోపి, ఆఫీస్ సబార్డినేట్లు వై. రమణ, వి. భాస్కరరావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# పోలసానిపల్లి పంచాయతీ అభివృద్ధి పనులపై వైసీపీ మద్దతు దార్ల దుష్ప్రచారం







**ఏలూరు నవంబర్ 26 పెన్ పవర్** : ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పనులపై కొంతమంది వైసీపీ మద్దతు దారులు అసత్య ప్రచారాలు చేస్తూ, బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్నారని గ్రామ సర్పంచ్ రహీమా బేగం హసేనా దంపతులు బుధవారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు గ్రామాభివృద్ధికి నిధులను మంజూరు చేసి గ్రామంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో గ్రామంలోని వైసీపీ మద్దతుదారులు గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్,పైన గ్రామానికి చెందిన మద్దతు దారుడు అసత్యాలతో కూడిన ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని, విమర్శించారు. అంతేకాకుండా పంచాయతీ అధికారుల పైన, పి.జి ఆర్ ఎస్ లోను, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ సదరు ఫిర్యాదులను ఉపసంహరించుకునేందుకు డబ్బులు డిమాండ్ చేస్తూ, పంచాయతీ సిబ్బందిని, పాలకవర్గాన్ని ఎంతో ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లే విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలసానిపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు పర్వీన్ కుమార్ పటేల్, పాకిన. సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో పోలసానిపల్లి గ్రామపంచాయతీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, పంచాయతీ పలు వార్డులలో సీసీ రోడ్లు వీధి దీపాలు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ లు ఇచ్చి, ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించడం జరిగిందని అని స్పష్టం చేశారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు సహాయ సహకారాలతో పంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎంపిక అయ్యేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకుంటున్నారని గ్రామ అభివృద్ధిని ఓర్వలేని వైసీపీ మద్దతు దారులు గ్రామ పంచాయితీ కార్యదర్శి పైన, పాలకవర్గం పైన అసత్య ఆరోపణలతో కూడిన బురదను జల్లుతున్నారన్నారు.

గ్రామ సర్పంచి మైనారిటీ వర్గానికి చెందిన మహిళ అయినప్పటికీ ఇతర సామాజిక వర్గాల పట్ల వివక్షత చూపకుండా వారి మనోభావాలు దెబ్బ తినకుండా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని హిందు స్మశాన వాటిక ను అభివృద్ధి చేయటం, సర్పంచి యొక్క ఔన్నత్యాన్ని చాటుతోంది.

**షేక్ హసేనా జనసేన నాయకులు పోలసానిపల్లి:**

పోలసానిపల్లి గ్రామాన్ని చెత్త కుప్పలు లేని గ్రామంగా తీర్చిదిద్దామని, అదే విధంగా 20 ఏళ్లుగా గ్రామంలో రహదారి మధ్యలోనున్న పాడుపడిన తాగునీటి పైపులైను ను తొలగించి జేజీఎం పనులలో భాగంగా కొత్త పైపులైను ఏర్పాటు చేసి ఇంటింటికి శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. సంపద కేంద్రాన్ని అభివృద్ధి పరచి, సంపద సృష్టించేందుకు మార్గం సుగమం చేశామన్నారు. గ్రామంలో ఆక్రమణకు గురైన బుచ్చిరెడ్డిగుంట 8 ఎకరాల చెరువును ఆక్రమణదారుల జనం నుండి విడిపించి దానిని సక్రమం చేశారు అన్నారు. అదేవిధంగా గ్రామంలో ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి వాటి లోని ఆక్రమణ లను తొలగించామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

**బి. జే. పి మండల కన్వీనర్ :**

కులమతాలకు అతీతంగా పోలసానిపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి కి,కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, కొంతమంది వైసీపీ మద్దతు దారులు గ్రామపంచాయతీ సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి జై రామకృష్ణ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఈ ఆరోపణలలో నిజాలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేసి బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్నారు.

-బి. జే. పి మండల కన్వీనర్


భీమడోలు మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి: భీమడోలు మండలంలో పంచాయతీ పాలకవర్గం ప్రజా ప్రతినిధుల సహకారంతో జరుగుచున్న అభివృద్ధి పనులలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటు చేసుకోలేదని, సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇటువంటి వివక్షతకు చోటు లేకుండా జరుగుతున్నాయని -భీమడోలు మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి పాకిన సత్యనారాయణ






# ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాలు

- వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 26.**

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తాడేపల్లిగూడెం నంది బొమ్మ సమీపంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తరువాత తాడేపల్లిగూడెం రూరల్ మండలం మోదిగుంట గ్రామంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారి దివ్య దర్శనం పొందారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం కోసం రూ. 10,000/- (పది వేల రూపాయలు) విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూరియాకు ప్రత్యామ్నాయంగా అమోనియం సల్ఫేట్‌ను 'జై కిసాన్' బ్రాండ్ విడుదల







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 26.**రైతులకు యూరియా ఎరువుకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే అమోనియం సల్ఫేట్‌ను 'జై కిసాన్' బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి విడుదల చేశారు. తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వద్ద పరదీప్ సొసైటీ లిమిటెడ్ కేకే బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో 2 వేల టన్నుల అమోనియం సల్ఫేట్ విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది.

ఈ కార్యక్రమానికి హాజరైన తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడిఏ గంగాధర్ రావు, తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు, ఎరువులు-పురుగుమందుల డీలర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ, దేశంలో అమోనియం సల్ఫేట్‌ను ఇప్పటివరకు రెండు కంపెనీలు మాత్రమే తయారు చేస్తుండగా, తాజాగా 'జై కిసాన్' బ్రాండ్ మూడో కంపెనీగా మార్కెట్లోకి అడుగుపెడుతోందని పేర్కొన్నారు. రైతులకు ప్రత్యేకంగా వాణిజ్య పంటల పెరుగుదలకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

ధాన్యం, టోబాకో, మిర్చి, అరటి తదితర వాణిజ్య పంటలకు అమోనియం సల్ఫేట్ అత్యంత ప్రయోజనకరమని వివరించారు.

ఈ కార్యక్రమంలో పరదీప్ సొసైటీ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ మహమ్మద్ రఫీ, వినయ్ కుమార్, డీలర్లు దూలం శ్రీనివాసరావు, మైలవరపు గోపాలకృష్ణ, వెజ్జు దుర్గాప్రసాద్, ఈతకోట చంద్రకాంత్ (చినబాబు), చిన్ని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపురం వంతెనను ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్





**పెన్ పవర్ ఉంగుటూరు నవంబర్ 26:**ఏలూరు కాలువపై నిర్మించిన నారాయణపురం వంతెనను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆఫ్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

గత జూన్ 15న వంతెన శిధిలావస్థకు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో వంతెనకు మరమ్మతులు చేసి కొత్త స్లాబ్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేసినందుకు గుత్తేదారుడు అక్కిన శేషును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద, మాజీ సర్పంచి అక్కిన నాగమణి, రాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, కూటమి నాయకులు అనిల్, ఆనంద్, రాంబాబు, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సుందరపల్లిలో సోమేశ్వర స్వామి ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన.



**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 26 :**

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరం మండలంలోని సుందరపల్లి గ్రామం లో ఉన్న శ్రీ ఉమా సమేత సోమేశ్వర స్వామి ముఖ ద్వారం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. మంత్రి సుభాష్ సూచన మేరకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, సీఎంఆర్ షాపింగ్ మాల్ వైజాగ్ మేనేజర్ మల్లెల బాబ్జి, కూటమి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గౌతమి గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ ఉమా సమేత సోమేశ్వర స్వామి ముఖద్వారం నిర్మాణం కోసం మంత్రి సుభాష్ సిఎంఆర్ షాపింగ్ మాల్( వైజాగ్) వారిని కోరడం జరిగిందని,ఈ మేరకు సిఎంఆర్ ద్వారా సుందరపల్లిలో ముఖద్వారం నిర్మించేందుకు అవకాశం కలిగిందన్నారు. నియోజవర్గ అభివృద్ధి కోసం మంత్రి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా, సి ఎస్ ఆర్ నిధులు, వ్యక్తిగతంగా కూడా అభివృద్ధి చేయటం ఆనందకరమన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా మంత్రి సుభాష్ నిత్యం కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు శీరెడ్డి సత్తిబాబు,ఎంపీటీసీ తాడాల జానకి రామయ్య, అడపా వెంకటేశ్వరరావు, అడపా సత్తిబాబు, సుంకర ఉదయ్ కుమార్, సలాది సత్తిబాబు, రంకిరెడ్డి మణికంఠ, అమలకట్ట బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.




## జగ్గంపేటలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 26:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జగ్గంపేటలో వివిధ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జగ్గంపేట మండల అధ్యక్షులు జి.అరుణ్ కుమార్ భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామన్నారు. కుల మతాలకు అతీతంగా ఉన్న ఉన్న ఏకైక గ్రంథం రాజ్యాంగం అన్నారు. అనంతరం విద్యార్థుల రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ సభ్యులు సాయి, వర్మ, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 25 లక్షలు రూపాయలతో స్వర్ణ వేలాయుధం..

- భక్తులు కంబాల శ్రీనివాసరావు సంకల్పం...
- తొలితగా 13 లక్షలు రూపాయలతో 100 గ్రాములు బంగారం కొనుగోలు...






**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 26:** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామం ప్రధాన రహదారిలో కొలివై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 25 లక్షలు రూపాయల వ్యయంతో స్వర్ణ వేలాయుధం చేయించడానికి భక్తులు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు సంకల్పించారు. బుధవారం కోరుకొండలో ప్రారంభమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. తొలిత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయన ఘన స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. ఆలయంలో స్వామివారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవలే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ నూతన పున :ప్రతిష్ట జరిగిందన్నారు. అప్పుడు ఆలయాన్ని సందర్శించినప్పుడు స్వామివారి చేతిలో ఉండే ఆయుధమైనా వేలాయుధం 25 లక్షలు రూపాయల వ్యయంతో, స్వర్ణ వేలాయుధం చేయిస్తానని, ప్రకటించడం జరిగిందన్నారు. అప్పుడు మాజీ సర్పంచ్ కటకం చలంకి లక్ష రూపాయలు విరాళం ఇవ్వడం జరిగిందని, ఆయన వాటితో తులం బంగారం కొనుగోలు చేశారన్నారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం భీమా జ్యువెలర్స్ లో 13 లక్షల రూపాయలతో 24 క్యారెట్ల 100 గ్రాములు బంగారాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ బంగారాన్ని షష్టి సందర్భంగా స్వామివారి సన్నిధిలో పెట్టడం జరిగిందన్నారు. అలాగే డిశంబర్ నెలలో మరో 14 తులాల బంగారాన్ని కొనుగోలు చేసి మొత్తం 25 తులాల బంగారంతో వేలాయుధం తయారు చేయించి, కోరుకొండ మండలంలో ప్రతి గ్రామానికి ప్రజల దర్శనార్థం ఊరేగించి, స్వామివారికి అలంకరించడం జరుగుతుందన్నారు. అలాగే కాప వీరబాబు అనే వ్యక్తి గత రెండేళ్ల క్రితం రథం కింద పడి కాలు నలిగిపోయి, కాలును తొలగించారు. కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి సహాయం చేయాలని కోరగా స్పందించిన ఆయన జైపూర్ నుంచి లక్ష రూపాయలు వ్యయంతో కృత్రిమ కాలును తెప్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ బ్రాహ్మణులు ఉండటానికి వసతి గృహాన్ని నిర్మించాలని కమిటీ సభ్యులు కోరగా, నిర్మాణానికి సహాయం అందిస్తానని ప్రకటించారు. అనంతరం రామసేన కార్యాలయం వద్ద భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

## గోవిందపురంలో నూతన సచివాలయం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 26** : జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.43.6 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. గోవిందపురం గ్రామ సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా పరిపాలనా సౌలభ్యం మరింత సులభవంతం అయిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ ధృవపత్రాలు పొందడంతో పాటు వివిధ ప్రభుత్వ పనులు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. గోవిందపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేదం వైద్యులు రవి వర్మతో గ్రామ అభివృద్ధి పై కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రైతుల ఇబ్బందులు వీడాలి : మంత్రి నాదెండ్ల మనోహర్





**పెన్ పవర్ ఉంగుటూరు నవంబర్ 26:** ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా లోపాలు, సమస్యలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఉంగుటూరు మండలం చేబ్రోలు, నారాయణపురం ప్రాంతాల్లోని ధాన్యం రాశుల వద్ద ఎమ్మెల్యే వత్సమట్ల ధర్మరాజు, అఫ్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి పర్యటించి రైతులతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై మంత్రి రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన ఒక రైతు మాట్లాడుతూ, తన భూములు ఆర్ఎస్కె%- 1, 2 పరిధిలో ఉండటంతో వేర్వేరుగా ఈకేవైసీలు చేయించామని, కానీ రెండు ఆర్ఎస్కె సెంటర్ల ధాన్యాన్ని ఒకే లారీలో తోలమంటే సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై మంత్రి అక్కడి వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ఎస్కే సిబ్బందిని ప్రశ్నిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఏ మిల్లుకు తరలిస్తున్నారో సమాచారం ఇవ్వకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం తోలిన 24 గంటల్లోపే నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతోందని రైతులు పేర్కొంటున్నప్పటికీ, రైతులు నచ్చిన మిల్లుకే ధాన్యం తోలుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నారాయణపురం ఆర్ఎస్లో 48 గంటలుగా లోడు చేసిన ధాన్యం మిల్లుకు వెళ్లకపోవడంపై రైతు జ్ఞాన వెంకటేశ్వరరావు మంత్రి వద్ద ఫిర్యాదు చేశారు. దీనికి సర్వర్ సమస్య కారణమని ఏవో ప్రవీణ్ కుమార్ వివరించారు.

తుఫాను నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని రక్షించుకునేందుకు ప్రభుత్వ భవనాలు, ప్రాంగణాలను వినియోగించుకోవచ్చని మంత్రి సూచించారు. ధాన్యం సేకరణలో టార్గెట్లు విధించడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ తెలియజేశారు. దీనిపై ఉంగుటూరు, నాచుగుంట ఆర్ఎస్కేలకు టార్గెట్లు లేకుండా సేకరణ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో లోపాలు ఉన్న నేపథ్యంలో మంత్రి జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్తో విచారణ జరపాలని ఆదేశించారు.



## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు...





**గోకవరం, పెన్ పవర్,నవంబర్ 26:** 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను కోరుకొండ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కోరుకొండ బస్టాండ్ లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 నవంబర్ 19న కేంద్ర ప్రభుత్వం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. రాజ్యాంగ కమిటీకి అధ్యక్షుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్యవహరించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

## కోరుకొండ సుబ్బారాయుడు ని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల..






**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 26:** కోరుకొండ శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి( కోరుకొండ సుబ్బారాయుడు)72 వ షష్టి మహోత్సవం సందర్భంగా స్వామి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు బదిరెడ్డి దొర, జాజుల గణేష్, కర్రీ గణేష్, ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు దంపతులు, నీరుకొండ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

# ఏడు వారాల వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ

### స్వామివారి నిత్య అన్నదానానికి విరాళం అందించిన భక్తులు





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 26:** ఏడు వారాల వెంకటేశ్వర స్వామి దర్శనానికి బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణాన్ని నింపేశారు. స్వామివారి ఆలయ సన్నిధిలో విశిష్ట పూజా కార్యక్రమాలు అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి అష్టోత్తర నిత్యకళ్యాణ పూజలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ముఖ్య అన్నదానానికి భక్తులు విరాళాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడకు చెందిన నూరి సూర్యనారాయణ, సత్యవతి, చి. సాయి సంతోష్ కుటుంబ సభ్యులు రూ.1,00,116/- రూపాయలు విరాళంగా అందించారు. వారిని ఆలయ అర్చకులు వేదమంత్రాలు చాటి ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు సదుపాయాలను మరింత బలోపేతం చేశారు.

